ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

బుధవారం 17 జనవరి 2024

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు 8లో..

కోళ్ల పందెం స్థావరంపై పోలీసుల దాడి 6లో..



ఆరోగ్యశాఖలో

డిప్యూటేషన్ల గుబులు

- ప్రక్షాళన దిశగా సర్కారు అడుగులు
- వివరాలు సేకరిస్తున్న ఉన్నతాధికారులు
- ఉద్యోగులు, వైద్య సిబ్బందిలో ఆందోళన
- త్వరలో వైద్యాధికారులకు

తప్పని స్థాన చలనం

జగిత్యాల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో డిప్యూటేషన్ల రద్దు గుబులు నెలకొంది. కొన్నేళ్లుగా పలువురు వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది డిప్యూటేషన్‌పై అక్రమంగా పలు ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం కొత్తగా ఏర్పడ్డ సర్కారు ఆరోగ్య శాఖలో అక్రమాల ప్రక్షాళన దిశగా ఉన్నతాధికారులు అడుగులు వేస్తున్నారు. వైద్యాధికారులు, ఉద్యోగులు, వైద్య సిబ్బంది డిప్యుటేషన్ విధులపై ప్రభుత్వం ఇటీవల దృష్టి సారించింది.

జిల్లాలో ఎంత మంది డిప్యుటేషన్‌పై పని చేస్తున్నారు...? ఎంత కాలం నుంచి చేస్తున్నారనే వివరాలతో జిల్లా వైద్యాధికారులను నివేదిక కోరారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు ఈ వివరాలు కోరినట్లు వైద్య అధి కార వర్గాలు పేర్కొంటున్నాయి. నిబంధనలకు విరు ద్ధంగా రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు కోరుకున్న చోటుకు డిప్యుటేషన్‌పై పోస్టింగ్‌లు ఇచ్చారని ఆరోపణ లున్న నేపథ్యంలో చర్యలు తీసుకునేందుకు సమగ్ర నివేదిక కోరినట్టు ఆరోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే ఒకరిద్దరు వైద్య అధికారుల డిప్యూటేషన్లను ఉన్నతాధికారులు రద్దు చేశారు. పదుల సంఖ్యలో ఉన్న వైద్యులు, సిబ్బంది డిప్యూటేషన్లను రద్దు చేయకుండా ఒకరిద్దరిని మాత్రమే రద్దు చేయడం వివాదాస్పదంగా మారింది. వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న అధికారులు సంగతేందని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఆరోగ్య శాఖలో డిప్యూటేషన్ల జబ్బు..

డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో కొన్నేళ్లుగా డిప్యుటేషన్ల జబ్బు పట్టుకున్నది. పోస్టు జీతం ఒకచోట ఉంటే పనిచేసేది మరోచోట అన్నట్టు ఉన్నది పరిస్థితి. డిప్యూటేషన్లే కాకుండా ఆన్ డ్యూటీ, వర్క్ ఆర్డర్‌ల పేరిట ట్రాన్స్‌ఫర్‌లకు అధికారులు గతంలో తెరలేపారు. ఇందులో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలో కొన్ని జరగగా, మరికొన్ని జిల్లా స్థాయిలో జరిగాయి. ఈ రకంగా జిల్లాలో సుమారు వంద మంది వరకు ఉద్యోగులు, వైద్య సిబ్బంది డిప్యుటేషన్ విధులు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. చాలా మంది వివిధ హోదాల్లో డిప్యు టేషన్‌పై అయిదేళ్ల, కొందరు పదేళ్ల నుంచి కూడా పనిచేస్తున్నారు.

వారికిచ్చిన ఆర్డర్లలో కొందరికి గడువు పేర్కొనకపోవడం, మరి కొందరికి ఆరు నెలలు, ఒక సంవత్సరం ఇలా కొంత గడువుతో ఉండడంతో వారంతా ఏళ్లుగా అలాగే పని చేస్తూ వస్తున్నారు. ఇందులో ఇటీవల గడువు ముగిసినా ఒకరిద్దరు వైద్యుల డిప్యూటే షన్లను రద్దు చేసినట్లు తెలుస్తోంది.

వైద్య విధాన పరిషత్‌లో విధులు ఇలా...

జిల్లాలోని వైద్య విధాన పరిషత్‌లో సుమారు 54 మంది స్టాఫ్ నర్సులు హైద్రాబాద్‌లోని చుట్టు పక్కల గల వివిధ ప్రాంతాలకు వెళ్లి డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి. జగిత్యాల మెడికల్ కళాశాల జిల్లా నుంచి ఒక ఆర్ఎంవో, ఒక జనరల్ మెడిసిన్, ఒకటి సూపర్‌స్పెషాలిటీ డాక్టర్‌లు ఇతర జిల్లాల్లో డిప్యూటేషన్‌పై వెళ్లారు. అదే విధంగా ఓ డెంటల్ డాక్టర్ పనిచేస్తున్న స్థలం జగిత్యాల కాగా ఒరిజినల్ పోస్టింగ్ పెద్దపల్లి, ఓ ఫిజిషిన్ పనిచేస్తున్న స్థలం జీహెచ్ఎంసీ కాగా జగిత్యాలలో పోస్టింగ్, ఒక కార్డియాలజిస్టు జగిత్యాలలో పనిచేస్తుండగా ఒరిజినల్ పోస్టింగ్ నిజామాబాద్, ఒక న్యూరోఫిజిషియన్ జగిత్యాలలో పనిచేస్తుండగా ఒరిజినల్ పోస్టింగ్ నిజామాబాద్, ఒక ఎండోక్రైనాలిస్టు జగిత్యాలలో పనిచేస్తుండగా హైద్రాబాద్‌లో పోస్టింగ్, ఒక జనరల్ మెడిసిన్ జగిత్యాలలో పనిచేస్తుండగా హైద్రాబాద్‌లో పోస్టింగ్ కలిగియున్నట్లు తెలుస్తోంది.

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో పోస్టింగ్ కలిగియున్న ఒక రేడియాలజిస్టు రాయికల్‌కు డిప్యూటేషన్‌పై వచ్చి అక్కడి నుంచి జగిత్యాలలో మరో డిప్యూటేషన్‌పై పని చేస్తుండడం విమర్శలకు దారితీస్తోంది. ఇద్దరు మెట్‌పల్లి, ఇద్దరు కోరుట్ల, ధర్మపురిలో ఎనిమిది మంది, రాయికల్‌లో ఏడుగురు వైద్యాధికారులు డిప్యూటేషన్‌లో పనిచేస్తున్నారు. ఒకరు జగిత్యాల నుంచి కరీంనగర్‌కు డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని నుంచి ధర్మపురిలో ఒక పిడియాట్రిషిన్ డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. తాజాగా మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న ఓ వైద్యుడి డిప్యూటే షన్‌ను రద్దు చేస్తూ ఒరిజినల్ పోస్టు అయిన రాయికల్‌లో పనిచేయాలని ఆదేశిస్తూ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. కేవలం ఒక్క వైద్యుని డిప్యూ టేషన్ రద్దు చేయడం వివాదాస్పదంగా మారింది. ఇదే విధంగా ఇతర డిప్యూటేషన్లను రద్దు చేస్తారన్న గుబులు వైద్య ఆరోగ్యశాఖ వర్గాల్లో నెలకొంది.

వైద్య ఆరోగ్య శాఖలో ఇలా...

జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖలో సుమారు పది మంది వరకు వర్క్ ఆర్డర్‌పై పనిచేస్తున్నారు. ఇందులో మల్యాలలో ఒక సూపర్‌వైజర్, ఒక పీహెచ్ఎం, పెగడపల్లిలో ఒక స్టాఫ్ నర్సు, కొడిమ్యాల ఒక సూపర్‌వైజర్, ఒక సీనియర్ అసిస్టెంట్, కోరుట్లలో ఒక స్టాఫ్ నర్సు వర్క్ ఆర్డర్‌పై పని చేస్తున్నారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి నుంచి ఒక ఏఎన్ఎం దరూర్‌లో వర్క్‌ఆర్డర్‌పై పనిచేస్తున్నారు. జిల్లా నుంచి సుమారు 30 మంది వరకు స్టాఫ్ నర్సులను వివిధ జిల్లాల్లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు.

ప్రస్తుతం ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న డిప్యూటేషన్ అధికారులు, ఉ ద్యోగుల వివరాలు సేకరిస్తుండడం సంబంధిత వర్గాల్లో గుబులు రేపుతోంది. ఈ విషయమై జగిత్యాల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాములును సంప్రదించగా వైద్యుల డిప్యూటేషన్ వ్యవహారాలు ఇతర అధికారులు చూసుకుంటారని, ఇటీవల ఉన్నతాధికారులు వైద్య ఆరోగ్య శాఖలో డిప్యూటేషన్ల సమాచారం అడిగినట్లు వినబడిందని తెలిపారు.

ఇటు నుంచి అటు.. అటు నుంచి ఇటు..

జగిత్యాల జిల్లాకు చెందినవారు పక్క జిల్లాల్లో, పక్క జిల్లా వారు జగిత్యాల జిల్లాలో పనిచేస్తుండడం గమనార్హం. వీరికి తోడు పలువురు అంతర్గతంగా జిల్లాలో సైతం ఒక చోట పోస్టింగ్ మరో చోట డిప్యూటేషన్ విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ఆఫీస్ సబార్డినేట్, అటెండర్, డ్రైవర్, ఆశా, ఏఎన్ఎం, స్టాఫ్ నర్సులు, సూపర్‌వైజర్, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నిషియన్లు, హెల్త్ ఎడ్యుకేటర్, డీపీఎంలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, కొందరు పీహెచ్‌సీ మెడి కల్ ఆఫీసర్లు...ఇలా అన్ని కేడర్ల ఉద్యోగులు, సిబ్బంది డిప్యూటేషన్‌పై ఉండడం గమనార్హం.

ఉద్యోగులు, వైద్య సిబ్బందిలో టెన్షన్..

డిప్యుటేషన్లపై ఉన్నతాధికారులు నివేదిక కోరడంపై వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే ఉద్యోగులు, వైద్య సిబ్బందిలో గుబులు మొదలైంది. సొంత స్థానంలోకి తిరిగి వెళ్లాల్సి వస్తదేమోనని ఆందోళన చెందుతున్నారు. ఇన్నాళ్లు ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకొని అనుకూలమైన ప్రాంతాల్లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. ఎవరడుగుతారనే ధీమాతో సేవలు అవసరం లేకున్నా పోస్టే లేని స్థానాల్లో ఏళ్ల తరబడి పనిచేస్తూ వస్తున్నారు. ఈ వ్యవహారంలో గతంలో పెద్ద మొత్తంలో డబ్బు చేతులు మారిందనే ఆరోపణలున్నాయి. అవినీతి అధికారులను ప్రోత్సహించవద్దని, నిజాయితీగా పని చేసే వారినే జిల్లా, డివిజన్, మండల అధికారులు నియమించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా వైద్యాధికారులకు కూడా త్వరలో స్థానచలనం ఉంటుందని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ఉన్నతాధికారులకు వివరాలు అందించాము

డాక్టర్ సుదక్షిణదేవీ, వైద్య విధాన పరిషత్ కో ఆర్డినేటర్



జిల్లాలో వివిధ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో డిప్యూటేషన్‌పై పని చేస్తున్న వైద్యులు, ఉద్యోగుల వివరాలు, ఇతర జిల్లాల్లో ఒరిజినల్ పోస్టింగ్ కలిగియుండి జిల్లాలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలను ఉన్నతాధికారులకు ఇటీవల అందిచాము. ఈ వ్యవహారం ప్రభుత్వ నిర్ణయం మేరకు ఆధారపడి ఉంటుంది.

ఎలాంటి సమాచారం అడగలేదు

డాక్టర్ పుప్పాల శ్రీధర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి



జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో డిప్యూటేషన్ విధులపై ఉన్నతాధికారులు ఎలాంటి సమాచారం అడగలేదు. పలు ఆసుపత్రుల్లో వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు, ఇతర ఉద్యోగులు డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు. జిల్లా నుంచి ఇతర జిల్లాలకు సైతం పలువురు ఉద్యోగులు ఇతర జిల్లాలకు వెళ్లి పనిచేస్తున్నారు.

ఏబీసీడీ వర్గీకరణకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



హైదరాబాద్‌లో మంత్రి దామోదర రాజనర్సింహతో అడ్లూరి

ధర్మపురి, జనవరి 16: దళిత వర్గంలో జనాభా ప్రాతిపదికన ఏబీసీడీ వర్గీకరణ కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశానుసారంగా హైదరాబాద్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డితో సోమవారం మానకొండూర్, తుంగతుర్తి ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ, మందుల సామ్యూల్ సహా ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ దళితుల జనాభా ప్రాతిపదికన ఏబీసీడీ వర్గీకరణ కోసం జరుగుతున్న పోరాటం నేతృత్వంలో ఈ నెల 17న సుప్రీం కోర్టులో వాదనలు ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం పక్షాన సుప్రీం కోర్టులో వాదనలు వినిపించేందుకు సీనియర్ కౌన్సిల్ న్యాయవాదని ఏర్పాటు చేస్తామన్నారు. సీఎం ఆదేశానుసారంగా సుప్రీం కోర్టులో వాదనలు వినిపిస్తామన్నారు. సుప్రీం కోర్టుపై తమకు పూర్తిగా నమ్మకం ఉందని ఆయన తెలిపారు. దళిత వర్గంలోని మాదిగలకు న్యాయం జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

రోళ్లవాగు ప్రాజెక్టు పనుల అడ్డంకులను తొలగించాలి

మంత్రి ఉత్తమ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్



మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ రమణ

జగిత్యాల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని బీర్‌పూర్ మండలంలో రోళ్లవాగు ప్రాజెక్టు పనుల చివరి దశకు చేరుకున్న సందర్భంగా ఎదురవుతున్న అడ్డంకులను తొలగించాలని కోరుతూ రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్ రమణ హైదరాబాద్‌లో మంగళవారం కలిశారు. రోళ్లవాగు ప్రాజెక్టు పనులను ముగించడానికి అవసరమైన అటవీ శాఖ క్లియరెన్స్‌ను తీసుకొని, గేట్లు బిగించి రోళ్ల వాగులో నీరు నింపాలని కోరారు. ఇందుకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తెలిపారు. జగిత్యాల పట్టణ డబుల్ బెడ్ రూం ప్రాజెక్టు విషయంలో రెవన్యూ, హౌజింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి సమస్య విన్నవించినట్లు తెలిపారు. డబుల్ బెడ్ రూం ఇళ్లకు విద్యుత్, రహదారులు, మురికి కాలువల సౌకర్యం కోసం నిధులు కేటాయింపు జరుపాలని కోరారు. కాలనీలో నిర్మించిన ఇళ్లలో లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా మిగిలి ఉన్న 800 ఇళ్లను పట్టణంలోని అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని కోరారు. జగిత్యాల వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును కలిసి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. తాము విన్నవించిన సమస్యల పరిష్కారానికి ఆయా శాఖల మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

రహదారి పక్కకు దూసుకెళ్లిన కారు

మల్యాల, జనవరి 16: మల్యాల క్రాస్ రోడ్డు సమీపంలో ఓ కారు అదుపు తప్పి రహ దారి పక్కకు దూసుకెళ్లింది. మంగళవారం వేకువజామున చోటు చేసుకున్న ఈ సంఘటనలో దూసుకెళ్లిర కారు చెట్టుకు ఢీకొట్టడంతో ముందు భాగం ధ్వంసం అయింది. అయితే ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరుగలేదని వారంత వెళ్లి పోయినట్లు స్థానికులు తెలిపారు.

ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పరామర్శ

పెగడపల్లి, జనవరి 16 : దోమలకుంటకు చెందిన బండారి శ్రీనివాస్ భూతగాదా విషయంలో గొడవపడి పురుగుల మందు తాగి జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మంగళవారం ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. నాణ్యమైన వైద్యం అందిం చాలని డాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా వారి వెంట పార్టీ మండలాధ్యక్షులు బుర్ర రాములు గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్, నాయకులు కడారి తిరుపతి, కుంచె రాజేందర్ ఉన్నారు.

అయోధ్య ఆహ్వాన కరపత్రిక ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, బోగ శ్రావణి

జగిత్యాల టౌన్, జనవరి 16 : అయోధ్యలోని శ్రీ రామ మందిరంలో భవ్య బాల రాముని విగ్రహ ప్రాణ పతిష్ఠను పురస్కరించుకుని నిర్వహిస్తున్న శ్రీ సీతారామ చంద్ర కళ్యాణం, పట్టాభిషేక మహోత్సవ ఆహ్వాన కరపత్రాలను సోమవారం స్థానిక కోందడ రామాలయంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆవిష్కరించారు. శ్రీరాముడు అందరి దేవుడని వేడుకలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్ గోళి శ్రీనివాస్, కౌన్సిలర్ శ్రీలత, ఆలయ చైర్మన్ నరేష్, నిర్వాహణ కార్యదర్శి అరుణ్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వభూమిలో గుడిసెల తొలగింపు

జగిత్యాలరూరల్, జనవరి 16 : జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ , టీఆర్‌నగర్ శివారులో ప్రభుత్వ భూమిలో అక్రమంగా కొంతమంది వేసిన గుడిసెలను కలెక్టర్ ఆదేశాలమేరకు రెవెన్యూ అధికారులు జిల్లా పోలీసుల సహాయంతో మంగళవారం ఉదయం జేసీబీలతో తొలగించారు. ప్రభుత్వ భూములను ఎవరైనా అక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జగిత్యాల రూరల్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామశివారులోని ప్రభుత్వ భూ ములను ఆక్రమణకు పాల్పడి, తిమ్మాపూర్ గ్రామస్థులపై దాడులకు ప్రోత్సహించిన కేసులో 9 మందిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. కొన్ని రోజుల క్రితం తిమ్మాపూర్ శివారులోగల ప్రభుత్వ భూ ములను ఆక్రమించడానికి యత్నించి, దాడులకు ప్రోత్సహించిన గుగులోత్ తిరుపతినాయక్, కడకుంట్లనాగరాజు, గర్వందుల రమేష్, ఇందురు సులోచన, పోచన్న, బాలకృష్ణ, శంకర్, హేమలత, రజియాసు ల్తానాలను అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్ తరలించినట్లు ఎస్సై తెలిపారు.

సీఎం రేవంత్ దృష్టికి సాగు నీటి సమస్య

- నియోజకవర్గంలో ప్రతీ ఎకరాకు నీరందిస్తాం
- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మల్యాల, జనవరి 16: ధర్మపురి నియోజకవర్గంలో రైతులు వరదకాలువ, ఎస్సారెస్పీ నీటి ఆధారంగా సాగు చేసుకుంటున్నారని పూర్తి స్థాయిలో నీటిని అందించాలని ఇటీవల తాను సీఎం రేవంత్‌రెడ్డిని కూడా కలిసి విన్నవించగా నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. మల్యాల మండలం తాటిపల్లి శివారులో వరదకాలువ-ఎస్సారెస్పీ లింక్ కాలువను సంబంధిత ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. మట్లాడుతూ లింక్-2 కెనాల్ ద్వారా నియోజకవర్గంలోని రంగదామునిపల్లి, జంగనాల ప్రాజెక్టలను నింపాలని గతంలో అనేక సార్లు కోరిన అప్పటి పాలకులు పట్టించు కోలేదన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. విప్ వెంట ఇరిగేషన్ ఈఈ సుధాకిరణ్, డీఈ నాయక్‌తో పాటు మల్యాల, పెగడపల్లి, వెల్గటూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, రాములుగౌడ్, శైలేంధర్‌రెడ్డి నాయకులు ఆదిరెడ్డి, ముత్యం శంకర్‌గౌడ్, అజయ్, సాయి, రవీంధర్‌రెడ్డి పాల్గొన్నారు

తెరపైకి జగిత్యాల బల్దియా అవిశ్వాసం

- సొంత పార్టీ కౌన్సిలర్లే అదనపు కలెక్టర్‌కు తీర్మాన పత్రం
- ప్రయత్నాలు మొదలుపెట్టిన ఆశావహులు
- ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆశీస్సులు ఎవరికో..?



సమిండ్ల వాణి



బండారి రజని



అడువాల జ్యోతి



వల్లెపు రేణుక

జగిత్యాల టౌన్, జనవరి 16 : సరిగ్గా ఏడాది క్రితం ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌పై సంచలన ఆరోపణలు చేస్తూ మున్సిపల్ చైర్ పర్సన్ పదవీకి బోగ శ్రావణి రాజీనామా చేశారు. అప్పట్లో ఈ వార్త సంచలనంగా మారగా తెలంగాణ మున్సిపాలిటీస్ ఆక్ట్-2019 ప్రకారం వైస్ చైర్మన్‌గా ఉన్న గోళి శ్రీనివాస్‌ను ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమిస్తూ 381/సి/2023 ద్వారా అప్పటి కలెక్టర్ రవి నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఏడాదిగా శ్రీనివాస్ జగిత్యాల బల్దియాకు ఇన్‌చార్జి చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో జగిత్యాల మున్సిపాలిటీ ఇన్‌చార్జి చైర్మన్ పాలన వ్యవహారం తెరమీదికి వచ్చింది. బీసీ మహిళకు కేటాయించిన పదవిని ఓసీగా ఉన్న వ్యక్తికి కేటాయించడం సంవత్సర కాలంగా పాలన చేయడంతో కొంత మంది బీసీ మహిళా అభ్యర్థులకు మింగుడు పడలేదు. దీంతో అవిశ్వాస తీర్మానాన్ని తెరమీదికి తెచ్చారనే ఆరోప ణలు వినిపిస్తున్నాయి. దీంతో ఇప్పుడు నూతన చైర్ పర్సన్ పదవిని దక్కించు కునేందుకు అపుడే ఆశావహులు తమ ప్రయత్నాలు మొదలయ్యాయి.

ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను ఆశావహులు కలుస్తూ మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. మరి సంజయ్ కుమార్ ఆశీస్సులు ఎవరికి దక్కేనో అని చర్చలు మొదలయ్యాయి.

ప్రయత్నాలు మొదలుపెట్టిన ఆశావహులు..

జగిత్యాల బల్దియా ఇన్‌చార్జి చైర్మన్ శ్రీనివాస్‌పై కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం పేడుతూ అదనపు కలెక్టర్‌కు లేఖ ఇవ్వడంతో నూతన చైర్ పర్సన్ పదవిని చేపట్టేందుకు ఆశావహులు అపుడే ప్రయత్నాలు మొదలుపెట్టారు. చైర్ పర్సన్ పదవి బీసీ మహిళకు కేటాయించడంతో పోటా పోటీగా మారింది. గతంలో చైర్ పర్సన్ పదవి కోసం పోటీ పడి బంగపడ్డ 39 వార్డు కౌన్సిలర్ సమిండ్ల వాణి, 33 వార్డు కౌన్సిలర్ బండారి రజని మరోసారి తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఈ సారి ఏలాగైనా చైర్ పర్సన్ పదవిని కైవసం చేసుకోవాలని పావులు కదుపుతున్నారు. గతంలో చైర్ పర్సన్‌గా ఉన్న బోగ శ్రావణి రాజీనామా చేయడంతో అదే సామాజిక వర్గానికి చెందిన 36 వార్డు కౌన్సిలర్ అడువాల జ్యోతి తనకే చైర్ పర్సన్ పదవి ఇవ్వాలని కోరుతూ ఇప్పటికే కౌన్సిలర్లతో పాటు ఎమ్మెల్యేను కలిసి మద్దతు కోరారు. వీరితో పాటు రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షుడు వల్లెపు మొగిలి సతీమణి 7వ, వార్డు కౌన్సిలర్ వల్లెపు రేణుక సైతం చైర్ పర్సన్ రేసులో ఉన్నారు. వీరితో పాటు బీసీ-మహిళాగా విజయం సాధించిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు మరికొంత మంది ఇండిపెండెంట్లు పీఠం దక్కించుకునేందుకు అప్పుడే చర్చలు మొదలు పెట్టారు.

వారం రోజుల్లోనే మారిన సీన్...

జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ పదవి ఇప్పుడు జిల్లాలో హాట్ టాఫిక్‌గా మారింది. పదవికి ఎన్నిక నిర్వహించాలని కోరుతూ ఇన్‌చార్జి చైర్మన్ గోళి శ్రీనివాస్ వారం రోజుల క్రితం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎన్నికల నియమావళి ప్రకారం చైర్మన్ కోసం తగిన చర్యలు తీసుకొని యధావిధంగా వైస్ చైర్మన్ బాధ్యతలు కొనసాగించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ వ్యవహారం జరిగి వారం రోజులు గడువక ముందే సొంత పార్టీ నాయకులు సీన్ మార్చేశారు. వైస్ చైర్మన్ శ్రీనివాస్ తన ఇన్‌చార్జి చైర్మన్ పదవికి రాజీనామా చేయకపోవడం, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ హైదరాబాద్ పర్యటనలో ఉండడం, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సంక్రాంతి పండుగ సంబారాల్లో ఉండడంతో చైర్ పర్సన్ పదవిని ఆశిస్తూ కొందరూ అవిశ్వాసానికి తెరలేపినట్లు గుస గుసలు వినిపిస్తున్నాయి. పదవి వద్దని ఇన్‌చార్జి చైర్మన్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చినప్పటికి ఆ పదవీ తనకంటే తనకే దక్కించుకునేందుకు ఆవిశ్వాసం పేరుతో కొత్త రాజకీయ నాటకానికి తెరలేపినట్లు కౌన్సిలర్లే చర్చించుకోవడం కనిసించింది.

జగిత్యాల బల్ది యా మొదటి గ్రేడ్ మున్సిపాలిటీ కావడంతో చైర్ పర్సన్ పదవిని ఎలాగైనా ఉన్న కొన్ని రోజులు దక్కించుకోవాలని ఆశావాహులు క్యాంపు రాజకీయాలకు ఎర వేసి నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఎలాంటి నిర్ణ యం తీసుకుంటారో అని బీఆర్ఎస్ వర్గాల్లో అపుడే చర్చలు మొదలయ్యాయి.

మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస నోటీసు



అదనపు కలెక్టర్‌కు అవిశ్వాస నోటీసు అందిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్లు

జగిత్యాల: జగిత్యాల మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్‌గా వ్యవహరిస్తున్న వైస్ చైర్మన్ బీఆర్ఎస్‌కు చెందిన గోలి శ్రీనివాస్‌పై పలువురు బీఆర్ఎస్, ఎంఐఎం కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటిస్తూ మంగళవారం జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లతకు పత్రం అందించారు. 27 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు, ఒక ఎంఐఎం కౌన్సిలర్ కలిసి అవిశ్వాస నోటీసును అందించారు. ఏడాది క్రితం చైర్‌పర్సన్ బోగ శ్రావణి పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఇన్‌చార్జి చైర్మన్‌గా వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్ కొనసాగుతుండడంతో పట్టణంలో అభివృద్ధి కుంటుపడిందని తెలిపారు. దీంతో వైస్ చైర్మన్ శ్రీనివాస్‌పై అవిశ్వాసం ప్రకటిస్తున్నామని స్పష్టం చేశారు. అవిశ్వాస ప్రత్యేక సమావేశం నిర్వహించి మెజార్టీ సభ్యుల నిర్ణయం మేరకు వైస్ చైర్మన్ పదవి నుంచి శ్రీనివాస్‌ను తొలగించడంతో పాటు చైర్ పర్సన్, వైస్ చైర్మన్ పదవులకు ఎన్నికను నిర్వహించాలని ఈ సందర్భంగా కోరారు. జగిత్యాల పట్టణంలో 48 వార్డులుండగా మున్సిపల్ చైర్‌పర్సన్ పదవితో పాటు కౌన్సిలర్ పదవికి శ్రావణి రాజీనామా చేయడంతో ఓ కౌన్సిల ర్ పదవి ఖాళీగా ఉంది.

ప్రస్తుతం ఉన్న 47 వార్డు కౌన్సిలర్లలో 31 బీఆర్ఎస్, ఏడు కాంగ్రెస్, మూడు బీజేపీ, ఐదుగురు స్వతంత్రులు, ఒకరు ఎంఐఎం పార్టీకి చెందిన వారున్నారు. సంపూర్ణ బలం ఉన్నప్పటికీ సొంత పార్టీకి చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు అదే పార్టీకి చెందిన వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ నోటీసు ఇవ్వడం రాజకీయవర్గాల్లో చర్చనీయాశంగా మారంది.

రైలు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

కరీంనగర్ క్రైం, జనవరి 16: కరీంనగర్ రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం ఉదయం రైలు పట్టాలు దాటుతున్న సమయంలో ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు ఢీకొని జనగాం రాజు(40) అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. రాజు ఎడమ కాలు మోకాలు కింది వరకు తెగి వేరుగా పడింది. మరో కాలు పాదానికి గాయాలయ్యాయి. కరీంనగర్ 108 సిబ్బంది శంకరయ్య, సంపత్‌లు క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రాజు వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడని, అతని ఎడమకాలు తొలగించారని కరీంనగర్ రైల్వే ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా బావ్‌పేట్‌కు చెందిన జనగాం రాజు కొత్తపల్లి మండలం రేకుర్తిలో నివాసం ఉంటున్నాడు.

33 ఏళ్లలో 84 దొంగతనాలు

● గోదావరిఖని పోలీసులకు చిక్కిన నిందితుడు

కోల్‌సిటీ, జనవరి 16: అంతర్ జిల్లా గజదొంగ షేక్ సలీం అలియాస్ ఉస్మాన్ అలియాస్ అస్లాం అలియాస్ జగన్(52)ను గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 25తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ప్రమోద్‌రావు పేర్కొ న్నారు. అంతర్ జిల్లాల్లో చోరీల్లో ఆరితేరిన సలీం దొంగతనాల చరిత్ర 33ఏళ్ల నుంచి కొనసాగుతుందన్నారు. హైదరాబాద్‌తో పాటు ఉత్తర తెలం గాణ జిల్లాలు ఉమ్మడి వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో అతడు చోరీలకు పాల్పడ్డాడు. పోలీస్ రికార్డుల్లోనే 84చోరీలపై కేసులు నమోదు అయ్యాయి. వరంగల్, చర్లపల్లి, చంచల్‌గూడ, నిజామా బాద్, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జైళ్లలో సలీం అలియాస్ ఉస్మాన్ జైలు జీవితం గడిపాడు. ఇతనిపై గతంలో పీడీ యాక్టు నమోదు అయినా తీరు మార్చుకోలేదు. జైలులో పరిచయం అయిన నేరస్థులు ఒకరు కోల్ బెల్టులో సింగరేణి కార్మికులు సంక్రాంతికి స్వస్థలాలకు వెళతారని, ఏ ఇంట్లో చోరీ చేసినా గిట్టుబాటు అవుతుందంటూ సలీంకు సమాచారం ఇచ్చారు. దీంతో అతడు గోదావరిఖనికి వచ్చి రెక్కీ చేసి గోదావరిఖనిలోకి మార్కండే యకాలనీ, ఎల్‌బీనగర్, రమేష్‌నగర్ ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లలోలో చోరీలకు పాల్పడ్డాడు. నగదుతో పాటు బంగారు, వెండి ఆభరణాలు ఎత్తు కెళ్లాడు. సాంకేతిక ఆధారాలు, దొంగతనం చేసిన తీరు, పోలీసుల ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌తో చోరీలకు పాల్పడింది సలీం అలియాస్ ఉస్మాన్‌గా గుర్తించారు. అతడు జగిత్యాల జిల్లా ఇబ్రహీం పట్నం మండలం అమ్మక్కపేటకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతడిని సోమవారం గోదావరిఖని లక్ష్మీనగర్‌లో అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు. అంతర్ జిల్లా దొంగను పట్టుకోవడంలో కృషిచేసిన క్రైమ్ టీఎం ఎస్ఐ సమ్మయ్య, ఏఎస్ఐ మల్లయ్య, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, వెంకటేష్‌ను సీఐ ప్రమోద్‌రావు అభినందించారు. అతని నేరాలపై మరింత దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో సీఐ-2 ప్రసాద్‌రావు, ఎస్ఐ సమ్మయ్య పాల్గొన్నారు.

కోళ్ల పందెం స్థావరంపై పోలీసుల దాడి

● 15 ద్విచక్ర వాహనాలు, రూ. 8,500 స్వాధీనం



సాతారం శివారులోని కోళ్ల పందెం స్థావరం

మల్లాపూర్, జనవరి, 16 : మల్లాపూర్ మండలంలోని సాతారం గ్రామ శివారులో గల ఓ మామిడి తోటలోని కోడి పందాల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. గ్రామ శివారులో కోడి పందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్సై నవీన్‌కుమార్ సిబ్బందితో దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని ఓ మామిడి తోటలో కోడి పందాలను నిర్వహిస్తున్నారని సమచారం మేరకు దాడులు చేయగా ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి నుం చి 8,500నగదు, ఆరు కోళ్లు, 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసు కున్నట్లు ఆయన తెలిపారు.

అతిగా మద్యం తాగి ప్రైవేట్ ఉద్యోగి మృతి

బర్కత్‌పుర, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం తాగి ప్రైవేట్ ఉద్యోగి మృతి చెందాడు. కాచిగూడ ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరి ఖనికి చెందిన మహిపాల్‌రెడ్డి(45) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరులో ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఉద్యోగ రీత్యా హైదరా బాద్ నగరానికి వచ్చాడు. లింగంపల్లి చౌరస్తా వద్ద వైన్ షాపులో అతిగా మద్యం తాగి కాచిగూడ చప్పల్‌బజార్ ఎస్‌వీఎస్ ఆస్పత్రి ఎదుట రోడ్డుపై పడిపోయాడు. అపస్మారక స్థితికి చేరుకొని చనిపోయాడు. సానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

బావిలో పడి వృద్ధురాలు మృతి

సైదాపూర్, జనవరి 16: సైదాపూర్ మండలంలోని ఎల్లంపల్లి గ్రామానికి చెందిన గాజుల లక్ష్మి(70) అనే వృద్ధురాలు ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మి సోమవారం మధ్యాహ్నం తమ వ్యవసాయ బావి వద్దకు పని మీద వెళ్లింది. సాయంత్రం వరకు తిరిగి రాలేదు. దాంతో కుటంబ సభ్యులు గ్రామంతో పాటు బంధువుల ఇళ్ల వద్ద వెతికినా దొరకలేదు. మంగళవారం ఉదయం తమ వ్యవసాయ బావి పక్కన గల రాము లపల్లి గ్రామానికి చెందిన ఎర్రం మహేందర్‌రెడ్డి వ్యవసాయ బావి వద్ద చెప్పులు కనిపించాయి. దాంతో గ్రామస్థుల సాయంతో ఆ బావిలో పాతాల గరిగె(అంకెన్న)తో వెతుకగా లక్ష్మి మృతదేహం లభించింది. తన భార్య లక్ష్మి ప్రమాదవశాత్తు బావిలో జారి పడి మృతి చెందిందని, మృతు రాలి భర్త గాజుల మొగిలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జన్ను ఆరోగ్యం తెలిపారు.

ప్రమాదవశాత్తు అసిస్టెంట్ హెల్పర్ మృతి

కోనరావుపేట, జనవరి 16: ప్రమాదవశాత్తు బావిలో పడి సెస్ కార్యాలయంలో అసిస్టెంట్ హెల్పర్‌గా పనిచేస్తున్న శ్రీరాముల రాజేశం (55) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం కొలనూరు గ్రామానికి చెందిన శ్రీరాముల రాజేశం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సెస్‌లో అసిస్టెంట్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. 2011లో యాక్సిడెంట్‌లో గాయపడ్డాడు. అప్పటి నుంచి మతిస్థిమితం సరిగ్గా ఉండదు. రోజూ కొలనూరు నుంచి వెళ్లి సిరిసిల్ల పట్టణంలో అసిస్టెంట్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో డ్యూటీకి వెళ్తున్నట్లు భార్యకు చెప్పి బయల్దేరాడు. కొలనూరు శివారులోని వ్యవసాయ బావి పక్క నుంచి వెళ్తుండగా రాజేశం ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు గుర్తించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజనేయులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


రాజు (ఫైల్)

సిరిసిల్ల క్రైం, జనవరి 16: సిరిసిల్ల పట్టణంలోని గాంధీచౌక్ వద్ద ఓ దుకాణంలో బత్తుల రాజు (38) అనే యువకుడు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సిరిసిల్ల టౌన్ ఇన్‌చార్జి సీఐ సదన్‌కుమార్ వివరాల ప్రకారం... ముస్తాబాద్ మండలంలోని ఆవునూరు గ్రామానికి చెందిన రాజు సిరిసిల్లలో సెంట్రింగ్ వర్క్స్ దుకాణం ఏర్పాటు చేశాడు. భవనాలకు సెంట్రింగ్ కాంట్రాక్టు పడుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే క్రమంలో సంక్రాంతి పండుగరోజు సోమవారం ఇంటి నుంచి సిరిసిల్లకు వచ్చిన రాజు దుకాణంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయం తెలుసు కున్న కుటుంబ సభ్యులు వెంటనే సిరిసిల్లకు వచ్చి రాజుకు జిల్లా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఎల్లా రెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. సెంట్రింగ్ పనుల్లో నష్టాలు రావడమే కాకుండా అప్పులు పెరిగి మనస్తాపం చెంది తన భర్త రాజు ఆత్మ హత్య చేసుకున్నట్లు అతడి భార్య సింధూర పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనారోగ్యంతో వలస కూలీ ఆత్మహత్య

సిరిసిల్ల రూరల్, జనవరి 16: తంగళ్లపల్లి మండలం టెక్స్‌టైల్ పార్క్ ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న వలస కూలీ చంద్రహాస్ (61) అనారోగ్యంతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అజాంఘడ్ ప్రాంతంలోని లాల్‌గంజ్ జిల్లాలోని హరిష్‌పూర్ గ్రామానికి చెందిన అయన జీవనోపాధికోసం ఇక్కడికి వచ్చి ఇందిరమ్మకాలనీలో అద్దెకు ఉంటూ టెక్స్‌టైల్ పార్క్‌లో పని చేస్తున్నాడని తెలిపారు. కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న అయన మంగళవారం అద్దెకు ఉంటున్న ఇంటోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసున్నాడని ఇంటి యాజమాని కందికొప్పుల స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు.

భూ తగాదాలో ఇద్దరు రైతుల ఆత్మహత్యాయత్నం

● సోషల్ మీడియాలో పోస్టులు ● ఇద్దరిపై కేసు

పెగడపల్లి, జనవరి 16: పెగడపల్లి మండలం దోమలకుంటలో భూతగాదా విషయంలో ఇద్దరు రైతులు సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఒకరి తరువాత ఒకరు పురుగుల మందు తాగుతూ సెల్ఫీ వీడియోలు తీసుకోవడంతో పాటు వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పెగడపల్లి ఎస్.ఐ సీహెచ్.సతీష్ ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతుండగా ఇద్దరు జగిత్యాలలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బండారి శ్రీనివాస్‌కు చెందిన వ్యవసాయ భూమిని అదే గ్రామానికి చెందిన తొట్ల శేఖర్‌కు విక్రయించాడు. దీనికి సంబంధించి 31 గుంటల భూమి పట్టా కాగా మిగతాది పెండింగ్‌లో ఉంది. ఇలా కొద్ది రోజులు గడవగా తిరిగి తన భూమి తనకు కావాలని శ్రీనివాస్ శేఖర్‌ను కోరాడు. పెద్దల సమక్షంలో పంచాయతీ చేసుకుని భూమి తిరిగి ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. గడువు సమయంలో భూమికి సంబందించిన డబ్బుల చెల్లింపుల విషయంలో గొడవలు తలెత్తగా సోమవారం ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ పురుగుల మందు తాగారు. స్థానికులు ఇద్దరినీ జగిత్యాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. శ్రీనివాస్, శేఖర్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ సతీష్ తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురి అరెస్ట్

జగిత్యాలరూరల్/రాయికల్ జనవరి 16: రాయికల్ మండలం భూపతిపూర్ శివారులో మంగళవారం గంజాయి రవాణా చేస్తున్న భూపతిపూర్ గ్రామానికి చెందిన ఎండీ దిల్షాద్, కడార్ల మహేష్, పెద్దిరెడ్డిజయంత్, దొనిపాల సాయిభరద్వాజ్ తోపాటు ఒక మైనర్ ఐదుగురు వ్యక్తులను పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ తెలిపారు. జగిత్యాల రూరల్ సీఐ కార్యాలయంలో మంగళ వారం విలేకర్ల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. మంగళవారం మధ్యాహ్నం రాయికల్ ఎస్సై అజయ్ తన సిబ్బందితో కలిసి భూపతిరోడ్ ఎక్స్‌రోడ్ వద్ద వాహనాలు తనిఖీచేస్తుండగా ఐదుగురు అనుమానాస్పదంగా కలిపించారు. వీరిని అదుపులోకి తీసుకొని విచారించగా వారి వద్ద నుంచి 4.03 కిలోల విలువ గల గంజాయి, రూ లక్ష 750 రూపాయలతో పాటుగా ఐదుసెల్‌ఫోన్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై అజయ్, కానిస్టేబుల్స్ సాగర్, సంతోష్, ప్రశాంత్ లను సీఐ అభినందించారు.

అంగారిక టౌన్ షిప్‌లో చోరీ

- 55చదరపు మీటర్ల అల్యూమినియం కండక్టర్ల అపహరణ

తిమ్మాపూర్, జనవరి16: మండలంలోని రామకృష్ణ కాలనీ అంగారిక టౌన్ షిప్‌లో విద్యుత్ స్తంభాలపై ఉన్న వైర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. ఎల్ఎండి ఎస్సై చేరాలు, విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఏఈ శ్రీధర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం అంగారిక టౌన్ షిప్‌లో నూతనంగా విద్యుత్ లైన్లు వేస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా వరుసగా సెలవులు రావడంతో పనుల్లో అంతరాయం ఏర్పడింది. ఇదే అదునుగా దొంగలు చోరీకి పాల్పడి 20విద్యుత్ స్తంభాలపై ఉన్న సుమారు 55 చదరపు మీటర్లు(సుమారు450కిలోల) అల్యూమినియం కండక్టర్ల(వైరు) కట్ చేసుకొని ఎత్తుకెళ్లారు. దాని విలువ సుమారు 3లక్షల రూపాయల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. విద్యుత్ ఏఈ శ్రీధర్ ఎల్ఎండి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండి ఎస్సై చేరాలు తెలిపారు.

కోర మీసాల స్వామికి కోటి మొక్కులు

● భక్తజన జాతరగా మారిన కొత్తకొండ ● మొక్కులు చెల్లించిన మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్



దర్శనానికి క్యూలైన్‌లో ఉన్న భక్తులు, స్వామివారు


మొక్కులు చెల్లించేందుకు వస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

భీమదేవరపల్లి, జనవరి 16: కొత్తకొండ.. భక్త జన జాతరగా మారింది. ఎటు చూసినా క్యూ లైన్లతో భక్తులు కిక్కిరిసిపోయారు. కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామివారికి కోరమీసాలు, గుమ్మడికాయలు మొక్కులు చెల్లించుకున్నారు. కొత్తకొండ జాతర ఆలయం ప్రాంగణం మొత్తం భక్తి పారవశ్యంతో ఊగిపోయింది. వీరభద్రుని నామస్మరణతో ఆలయం ఉప్పొంగిపోయింది. సోమవారం మకర సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగతో లక్షలాది మంది భక్తులు హాజరయ్యారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్, హుజూరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌కుమార్, వరంగల్ జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు జాతరకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర స్పెషలాఫీసర్ ఏసీ రామాల సునీత, ఆలయ ఈవో కిషన్ రావులు ఆలయానికి వచ్చిన అతిథులు, భక్తులకు స్వాగతం పలికారు. హనుమకొండ, వరంగల్, సిద్దిపేట, కరీంనగర్, జనగాం, నల్గొండ, జగిత్యాల, ఆదిలాబాద్, నిజామాబాద్, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామి వారికి ఇష్టమైన గుమ్మడికాయలు, కోరమీసాలు భక్తులు సమర్పించారు. ఈ నెల 15న సోమవారం సంక్రాంతి పండుగ సందర్భంగా బండ్లు తిరిగాయి. సంక్రాంతి పండగను పురస్కరించుకొని స్వామివారికి సోమవారం ఏకాదశి రుద్రాభిషేకం, వివిధ పండ్లతో రసాభిషేకం, క్షీరాభిషేకం ఆలయ ఈవో కిషన్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు నిర్వహించారు. కొత్తపల్లి గ్రామం నుంచి 65ఎడ్లబండ్లను అందమైన రథాలుగా తీర్చిదిద్ది ఆలయం చుట్టూ తిప్పారు.

రాష్ట్ర వ్యాప్త గుర్తింపుగా కొత్తకొండ జాతర

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

రాష్ట్ర వ్యాప్త గుర్తింపుగా కొత్తకొండ జాతరను నిర్వహిద్దామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం కొత్తకొండ జాతరలో స్వామివారికి గుమ్మడికాయ, కోరమీసాలు చెల్లించి పొన్నం ప్రభాకర్ విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి కొత్తకొండకు భక్తులు వచ్చే విధంగా ప్రచారం నిర్వహిస్తామన్నారు. కొత్తకొండ వీరన్నకు కోరమీసాలు సమర్పిస్తే కోరిన కోరికలు తీరుస్తాడని భక్తుల ప్రగాఢ నమ్మకం. వీరభద్రస్వామికి మొక్కులు చెల్లించి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మొక్కుకున్నానన్నారు.

● కొత్తకొండ జాతరలో వృక్ష ప్రసాదాన్ని మాజీ మంత్రి ఈటల రాజేందర్ వృక్ష ప్రసాద దాత జన్నాపురెడ్డి సురేందర్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. గత ఏడు సంవత్సరాలుగా కొత్తకొండ జాతరలో జన్నాపురెడ్డి సురేందర్‌రెడ్డి మొక్కలు పంపిణీ చేస్తున్నారు.


భక్తులతో కిక్కిరిసిపోయిన ఆలయ ప్రాంగణం


మేకల రథం


వృక్ష ప్రసాదం పంపిణీ చేస్తున్న ఈటల రాజేందర్

పీవీ ఇంటి నుంచి జాతరకు రథం

మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు కుటుంబీకులు గత 9 దశాబ్దాలుగా కొత్తకొండ శ్రీవీరభద్రస్వామికి ఎడ్ల బండి రథం తిరిగే ఆచారాన్ని కొనసాగిస్తున్నారు. పీవీ తనయుడు పీవీ రాజేశ్వర్‌రావు, పీవీ మదన్‌మోహన్ రావులు సోమవారం ఎడ్లబండి రథాన్ని ప్రారంభించారు. రథాన్ని అందంగా తయారు చేశారు. పీవీ నర్సింహారావు, పీవీ రాజేశ్వర్‌రావులు గతంలో రథం తమ ఇంటి నుంచి నడపడం ఆనవాయితీ. పీవీ చిన్న కుమారుడు పీవీ ప్రభాకర్‌రావు ఈ ఆనవాయితీ కొనసాగించారు.

సంక్రాంతి పర్వదినాన వేములవాడకు పోటెత్తిన భక్తులు


వేములవాడలో భక్తుల రద్దీ


బద్దిపోచమ్మ ఆలయం వద్ద బారులుదీరిన భక్తులు

వేములవాడ, జనవరి 16 : సంక్రాంతి పర్వదినాన వేములవాడ పుణ్యక్షేత్రం భక్తజనంతో జాతరను తలపించింది. సోమవారం వేలాది మంది భక్తులతో కిక్కిరిసిపోయింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందు ఇష్ట దైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు గత కొద్ది వారాలుగా వేలాదిమంది భక్తులు వేములవాడకు తరలివస్తున్నారు. ఈ క్రమంలో సంక్రాంతి పండుగ సోమవారం కలిసి రావడంతో సుమారు 50 వేల మందికి పైగా భక్తులు వివిధ ప్రాంతాల నుంచి రాజన్న దర్శనం కోసం తరలి వచ్చారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకుని తమ ఇష్టదైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని తరించారు. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. శ్రీ స్వామివారి నిత్య కళ్యాణం, సత్యనారాయణ వ్రతం తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న కారణంగా ముందుగా ప్రకటించిన విధంగా గర్భాలయంలో రుద్రాభిషేకం, అన్నపూజ తదితర ఆర్జిక సేవలను నిలిపివేసి శీఘ్రదర్శనం అమలు చేశారు. అయినప్పటికీ శ్రీ స్వామివారి సర్వ దర్శనం కోసం సుమారు మూడు గంటల సమయం, శీఘ్రదర్శనంకు సుమారు గంటకు పైగా సమయం పట్టింది. మేడారం వెళ్లడానికి ముందు భక్తులు శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దర్శించుకుని కోడె మొక్కు చెల్లించుకునే ఆనవాయితీ ఉండడంతో కోడె మొక్కుల క్యూ లైన్‌లో భక్తులు భారీ సంఖ్యలో బారులు తీరారు. ఆలయం నుండి గుడి చెరువు పార్కింగ్ స్థలం వరకు క్యూలైన్లో భక్తులు నిండిపోయారు. దీంతో కోడెమొక్కు చెల్లింపుకు సుమారు నాలుగు నుండి ఐదు గంటలకు పైగా సమయం పట్టింది. క్యూలైన్లలో భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వీఐపీల సిఫారసు లేఖలతో వచ్చిన వారు భక్తుల సమాచార కేంద్రం వద్ద చాలాసేపు నిరీక్షించాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా సోమవారం సుమారు 50 వేల మంది భక్తులు శ్రీ స్వామివారి దర్శించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్ నేతృత్వంలో ఏఈఓ బి.శ్రీనివాస్, పర్యవేక్షకులు తిరుపతి రావు, అల్లి శంకర్, ప్రోటోకాల్ విభాగం పర్య వేక్షకుడు సిరిగిరి శ్రీరాములు, పరిశీలకులు అశోక్, పవన్ కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ దేవాలయమైన బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. మేడారం సమ్మక్క సారక్క జాతరకు వెళ్లడానికి ముందు ఆనవాయితీ ప్రకారం సోమవారం నాడు తమ ఇష్టదైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు మంగళవారం బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తి శ్రద్ధలతో నైవేద్యం వండి బోనం తయారుచేసి బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

రాజన్న ఆలయంలో నేడు అభిషేక పూజలు రద్దు

వేములవాడ, జనవరి 16: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర దేవస్థానంలో 17వ తేదీ బుధవారం గర్భాలయంలో అభిషేక పూజలు రద్దు చేసినట్లు ఆలయ ఈవో డి కృష్ణ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో పాటు బుధవారం ఆలయ హుండీ లెక్కింపు చేపట్టనున్న కారణంగా మధ్యాహ్నం రెండు గంటల వరకు భక్తులకు గర్భాలయ ప్రవేశం నిలిపివేశామని, అన్నపూజ టిక్కెట్లను మధ్యాహ్నం ఒంటిగంట 30 నిమిషాల నుంచి జారీ చేస్తామని ఆయన వివరించారు.

రేపు మినీ జాబ్‌మేళా

గణేశ్‌నగర్, జనవరి16: ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు గురువారం ఉదయం 10గంటల నుంచి 2 గంటల వరకు జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, కరీంనగర్ నందు మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కే.దేవేందర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో పనిచేయుటకు పేటీఎంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, పోస్టుల కోసం విద్యార్హత ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ, పూర్తిచేసి ఉండాలన్నారు. 18-35 సంవత్సరాలలోపు వారు అర్హులన్నారు. వేతనం 15,500 నుంచి 21,000 రూపాయలు ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో కరీంనగర్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9989152622,9849331903నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చోరీ

కరీంనగర్ క్రైం, జనవరి 16: కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లిలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం రాత్రి దొంగతనం జరిగిందని స్థానికులు తెలిపారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో ఒక ఇన్వర్టర్, ప్రాథమిక పాఠశాలలో గ్యాస్ సిలిండర్, ఒక సీలింగ్ ఫ్యాన్ ఎత్తుకుపోయారని తెలిపారు.

భక్తులతో కిక్కిరిసిన కొండగట్టు


కొండగట్టు అంజన్న ఆలయం వద్ద భక్తులు

మల్యాల, జనవరి 16: కొండగట్టు అంజనేయస్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. సోమవారం రాత్రికే కొండపైకి చేరుకున్న భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో వేలాదిగా కొండపైకి భక్తులు తరలి వచ్చారు. స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో వెంకటేష్, ఏఈవో బుద్ది శ్రీనివాస్ ఇతర అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్ రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం రద్దీగా మారింది. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

గాలిపటం ఎగురవేస్తుండగా ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు

● విద్యుదాఘాతంతో ఒకరు.. భవనం పైనుంచి పడి మరొకరు

కోరుట్ల, జనవరి 16: జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో సోమవారం గాలిపటం ఎగరవేస్తుండగా ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణంలోని కల్లూర్ రోడ్డులోని భీముని దుబ్బ ప్రాంతంలో నివాసం ఉంటున్న పూర్ణ దుర్గాప్రసాద్ కుమారుడు ప్రశాంత్ 7వ తరగతి చదువుతున్నాడు. మండలంలోని పైడిమడుగు గ్రామానికి చెందిన తోకల కిష్టయ్య - నర్సు దంపతుల కుమారుడు సాత్విక్ పట్టణంలోని అమ్మమ్మ జుండర్తి సాంబయ్య - ఎల్లయ్య ఇంట్లో ఉండి ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సందర్భంగా సెలవులు రావడంతో సాత్విక్, ప్రశాంత్ ఇద్దరు కలిసి కాలనీలో ఉన్న ఖాళీ ప్రదేశంలో గాలిపటం ఎగురవేయడానికి వెళ్లారు. గాలిపటం ఎగుర వేస్తుండగా విద్యుత్ వైర్లకు తగిలి వేలాడుతుండటంతో సాత్విక్, ప్రశాంత్‌లు గాలిపటం తీయడానికి అక్కడే ఉన్న ఓ భవనం పైకి ఎక్కి తీసే ప్రయత్నం చేస్తుండగా విద్యుదాఘాతంతో సాత్విక్ తీవ్రంగా గాయపడ్డాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లి పడిపోయాడు. సాత్విక్ పరిస్థితి చూసి భయపడిన ప్రశాంత్ భవనం నుంచి పరుగు తీసే ప్రయత్నంలో భవనం నుంచి కింద పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కాలనీ వాసులు ఇద్దరినీ హుటాహుటిన స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఇద్దరిని ఉన్నత చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సంఘటన స్థలంను విద్యుత్ శాఖ ఎస్ఈ సత్యనారాయణ పరిశీలించారు. పట్టణం శివారులోని 133 కేవీ లైన్ నుంచి కల్లూర్ రోడ్డులో ఉన్న సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా కొరకు ఏర్పాటు చేసిన లైన్ నుంచి విద్యుత్ సరఫరా జరిగినట్లు ఎస్ఈ తెలిపారు. ఇండ్ల సముదాయాల నుండి సరఫరాను మార్చే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు ఎస్ఈ తెలిపారు.

చెక్‌డ్యాం కూల్చే యత్నం.. అడ్డుకున్న స్థానికులు

పెద్దపల్లి రూరల్, జనవరి 16: మండంలోని హుస్సేన్‌మియా వాగుపై నిర్మించిన చెక్ డ్యాంను కూల్చి వేసేందుకు కొంతమంది దుండగులు ప్రత్నించారు. అక్కడి స్థానికులు, రైతులు అడ్డుకోవడంతో సంఘటన స్థలం నుంచి జారుకున్నారు. పెద్దపల్లి మండలంలోని భోజన్నపేట, కొత్తపల్లి, మూలసాల గ్రామాలను ఆనుకుని ఉన్న హుస్సేన్‌మియా వాగులో సుమారు ఆరేళ్ల క్రితం వంద ఎకరాల పంటలను సాగు చేసుకునేందుకు సుమారు మూడు కోట్ల వ్యయంతో చెక్ డ్యాంను నిర్మించారు. నిర్మించిన నాటి నుంచి ఇప్పటివరకు కింది గ్రామాల రైతులకు సాగు నీరు అందుతోంది. అయితే సోమవారం కొంతమంది చెక్‌డ్యాంను కూల్చేందుకు ట్రాక్టర్ సహాయంతో డిటోనేటర్, జిలెటిన్ స్టిక్స్, డ్రిల్ మిషన్‌తో రాగా స్థానికులు గుర్తించారు. వారు సంఘటన స్థలానికి చేరుకొనేసరికి దుండగులు అక్కడి నుంచి జారుకున్నారు. సంఘటన స్థలం వద్ద చెక్ డ్యాంను కూల్చేందుకు తీసుకొచ్చిన ఒక డ్రిల్లింగ్ మిషన్, 8 డిటోనేటర్లు, 11 జిలెటిన్ స్టిక్స్ లభించాయి. దీంతో రైతులు పోలీసులకు సమాచారం అందించారు. చెక్ డ్యాంను బీజేపీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్, నాయకుడు పల్లె సదానందం, బీఆర్ఎస్ నాయకుడు బాలసాని ఈశ్వర్ గౌడ్ చెక్‌డ్యాంను పరిశీలించారు. ఘటనపై చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ డీఈఈ బుర్ర రాజ్యలక్ష్మి పెద్దపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మందుగుండు సామగ్రి లభ్యం..

చెక్ డ్యాంను కూల్చేందుకు వచ్చిన దుండగులు తీసుకొచ్చిన మందుగుండు సామగ్రిని రైతులు పోలీసులకు అప్పగించారు. చెక్ డ్యాంను కూల్చడానికి తీసుకువచ్చిన డ్రిల్ మిషన్, ఎనిమిది డిటోనేటర్లు, 11 జిలెటిన్ స్టిక్స్ లభించాయి. వాటిని పెద్దపల్లి పోలీసులకు అప్పగించారు. సాగు నీరు అందకపోతే అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమాచారం అందించాలి కాని కూల్చే ప్రక్రియ చాలా దారుణమైందని పేర్కొంటున్నారు.


చెక్ డ్యాం కూల్చివేతకు తీసుకొచ్చిన సామగ్రి

అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ



సత్తక్కపల్లిలో అక్షింతలతో శోభయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

మెట్‌పల్లి రూరల్, జనవరి 16: శ్రీ రామ జన్మ భూమి అయోధ్య నందు పూజించిన అక్షింతలు మంగళవారం మండలంలోని సత్తక్కపల్లిలో ఇంటింటికి పంపిణీ చేశారు. గ్రామంలోని ఆలయంలో అక్షింతలను ఉంచి పురోహితులు వేదమంత్రోత్సేల మధ్య ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం శోభాయాత్రగా బయలు దేరారు. భక్తులు, మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రామ భక్తులు ప్రవీణ్, మహేష్, మురళి, స్వామి, శేఖర్, నవీన్, సతీష్, మారుతి, యూత్ సభ్యులు, గ్రామస్థులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ పొందిన మల్లారెడ్డికి సన్మానం

రాయికల్, జనవరి 16: శాతవాహన యూనివర్సిటీ రసాయన శాస్త్ర విభాగంలో డాక్టరేట్ పొందిన మల్లారెడ్డికి మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన నల్లపు మల్లారెడ్డి చేసిన పరిశోధనలకుగాను శాతవాహన యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. సింథసిస్ ఆఫ్ న్యూ మాలిక్యులార్ హైబ్రిడ్స్ కంబైనింగ్ ట్రైఅజోల్ ఫార్మకోఫోర్ అండ్ దేర్ యాంటీ క్యాన్సర్ ఎవల్యూషన్ అనే అంశంపై రసాయన శాస్త్ర విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.జయంతి ప్రిన్సిపాల్, సైన్స్ కళాశాల పర్యవేక్షణలో చేసిన విశిష్ట పరిశోధనకు డాక్టరేట్‌ను అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు కొమ్ముల ఆదిరెడ్డి, కనపర్తి శ్రీనివాస్, మండలోజి శ్రీనివాస్, బొడుగం అంజయ్య, సర్పంచ్ సామల్ల లావణ్యవేణు, జలంధర్, కొల్లూరి వేణు,డ్రీమ్స్ యూత్ సభ్యులు ఆంజనేయులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్

కొడిమ్యాల, జనవరి 16: మండలంలోని నమిలికొండ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సీనియర్ వాలీబాల్ క్రీడాకారుల స్మారకార్థం ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో నమిలికొండ పోలీస్ బృందం వారు నిర్వహించిన వాలీబాల్ ఆటల పోటీలు ఆదివారం రాత్రి ముగిసాయి. విజేతలకు ఫింగర్ ప్రింట్ సీఐ చెలుమల్ల రాజు బహుమతులను అందించారు. ఈ పోటీలలో జగిత్యాల ఆరోగ్య హాస్పిటల్ జట్టు ప్రథమ బహుమతి 20 వేల రూపాయలను అందుకుంది. రెండో బహుమతిని కరీంనగర్ ఎస్సారార్ కాలేజీ 15 వేల రూపాయలు, మూడవ బహుమతిని జగిత్యాల పోలీస్ జట్టు 10 వేల రూపాయలు, నాలుగవ బహుమతిని 5వేల రూపాయలు నమిలికొండ జట్టు అందుకుంది. ఈ కార్యక్రమంలో ఫింగర్ ప్రింట్ సీఐ చెలిమల్ల రాజు, సర్పంచ్ అనిత, ఉప సర్పంచ్ శ్రీనివాస్, ఏఎస్సై ప్రకాష్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి క్రిష్టారెడ్డి, బహుమతుల దాతలు ఆలకుంట శ్రీనివాస్, రవి, ఇరుమల్ల కొమురయ్య, దాసె రాజయ్య ఫుడ్ స్పాన్సర్లు కాసం లక్ష్మీరాజం, ఇ. శ్రీనివాస్, స్పోర్ట్స్ కిట్ స్పాన్సర్ ఎస్. శ్రీనివాస్, షాబొద్దీన్, నమిలికొండ పోలీస్ బృందం పాల్గొన్నారు. ఈ వాలీబాల్ క్రీడలో 42 జట్లు పాల్గొన్నాయి.

స్వలాభాల కోసం పార్టీ పేరు వాడుకుంటే చర్యలు

మెట్‌పల్లి రూరల్, జనవరి, 16 : కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో కొందరు స్వలాభాల కోసం పార్టీ పేరు వాడుకుంటే చర్యలు తీసుకుంటామని నాయకులు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని కోనరావుపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ పుల్ల కిషన్‌గౌడ్ తమ స్వార్థ రాజకీయాల కోసం కాంగ్రెస్ పేరు వాడుకోవడం సరికాదన్నారు. అంతేకాకుండా పార్టీ అధికారంలో ఉన్నందున నాయకుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంతో పార్టీలో విభేదాలు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి చర్యలు పాల్పడుతున్న కిషన్‌గౌడ్‌పై కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. మరోసారి పార్టీ పేరు వాడుకుంటే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సురకంటి నారాయణరెడ్డి, మారు గంగారెడ్డి, మారు సాయిరెడ్డి, డాక్టర్లు స్వామికుమార్, జక్కని పరంధాములు, అనిరెడ్డి ఆనంద్‌రెడ్డి, ఇంద్రాల రవి, మిట్టపల్లి భూమేష్, జవిడి వినోద్, ఏనుగు సతీష్, ఏనుగు సంతోష్ పాల్గొన్నారు.

సమష్టిగా ఉండాలి: మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మెట్‌పల్లి, జనవరి, 16: కుల సంఘాలలోని సభ్యులు సమష్టిగా ఉండి కష్ట సుఖాలను పంచుకుంటూ ఎలాంటి గొడవలు పెట్టుకోకుండా సంతోషంగా ఉండాలని మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వంజర కుల సంఘం వారు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘం రాష్ట్ర నాయకులతో కలిసి ఆవిష్కరించారు. నూతన సంవత్సరంలో ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా నేరాల బారిన పడకుండా సుఖసంతోషాలతో ఉండాలని అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వంజర కుల సంఘం నాయకులు బొమ్మల శంకర్, బీసీ జిల్లా నాయకుడు నల్ల వెంకటేశ్వర్లు, లక్ష్మిపతి, ధాత్రికా భూమేశ్వర్, గంగోని సురేష్, చిన్నయ్య, కృష్ణ, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్ నరేష్ రెడ్డి

భీమారం, జనవరి 16: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్, మన్నెగూడెం సర్పంచ్ సింగిరెడ్డి నరేష్‌రెడ్డి అన్నారు. భీమారం మండల కేంద్రంలో సోమవారం ఉమ్మడి మేడిపల్లి, భీమారం మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 8 గ్రామాలు పాల్గొనగా టాస్ వేసి మొదటి రైడ్ చేసి క్రీడాకారులతో కబడ్డీ ఆడి ఉత్సాహపరిచారు. అనంతరం గెలుపొందిన మొదటి విజేత కాచారం జట్టుకు రూ.5 వేలు, రెండో విజేత వెంకట్రావుపేట జట్టుకు రూ.2500లు అందజేశారు. పీఈటీలుగా సిరిపురం మోహన్, పల్లికొండ మహేష్‌లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెక్కపెల్లి అరుణ, ఉప సర్పంచ్ బస్వరాజుల రాజు, ఎంపీటీసీ పల్లి అర్జున్, నిర్వాహకులు చెక్కపెల్లి సంజీవ్, బొమ్మెన ప్రశాంత్, ద్యావనపెల్లి రాకేష్, కొత్తపెల్లి రాజేందర్, చెక్కపెల్లి రఘు, గుగ్గిల్ల రవి, చెక్కపెల్లి అజయ్, పానుగంటి రాజేష్, వినోద్ పాల్గొన్నారు.

కేంద్రం ప్రవేశపెట్టిన చట్టాలను రద్దు చేయాలి

లారీ డ్రైవర్లు, క్లీనర్ల నిరసన



నిరసన తెలుపుతున్న లారీ డ్రైవర్లు, క్లీనర్ యూనియన్ నాయకులు

మెట్‌పల్లి, జనవరి 16 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన చట్టాలతో లారీ డ్రైవర్లు, క్లీనర్స్‌లు వీధిన పడే ప్రమాదం ఉన్నందున వెంటనే రద్దు చేయాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని లారీలను నిలిపివేసి కేంద్ర ప్రభుత్వానికి నిరసనగా వ్యతిరేకంగా నినాదులు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టాలతో లారీ డ్రైవర్లు, క్లీనర్ల కుటుంబాలు వీధిపాలయ్యే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి ప్రభుత్వం డ్రైవర్లు, క్లీనర్లను దృష్టిలో పెట్టుకొని ప్రవేశ పెట్టిన చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే తమ ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లారీ, క్లీనర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎండీ సీలంఖాన్, షేర్ వేణు, ఎండీ అజీస్, సోమిని రవి, భాస్కర్, ఫిరోజ్‌ఖాన్, ఎండీ రఫిక్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

భవగవంతుని సేవతో ఆత్మస్థైర్యం

మెట్‌పల్లి రూరల్, జనవరి, 16 : భగవంతుని పూజించడం, సేవలో పాల్గొనడంతో ఆత్మస్థైర్యం ఏర్పడి మనసు శాంతి లభిస్తుందని శ్రీ హరి తీర్థస్వామి, శ్రీ విరజానందు తీర్థస్వామి, శ్రీ మాత పరమేశ్వరి పేర్కొన్నారు. మండలంలోని వేంపేట గ్రామంలోని సత్యానంద మండలి వ్యవస్థాపకులు గాజంగి బాలయ్య, గాజంగి రాజమల్లయ్య వారి ఆధ్వర్యంలో సభ్యులు భగవద్గీత ఉపన్యాసాలు కార్యక్రమం మంగళవారం ముగిసింది. కార్యక్రమంలో సత్యానంద మండలి సభ్యులు, భక్తులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



మెట్‌పల్లిలో అయ్యప్పస్వామి ఆభరణాలు తీసుకొస్తున్న మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు



రాయికల్ మండలం ఇటిక్యాలలో ముగ్గుల పోటీలు

ఊరూరా ముగ్గుల పోటీలు

జగిత్యాల టౌన్, జనవరి 15: సంక్రాంతి పండుగను సోమవారం జిల్లా వాసులు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో మహిళా కౌన్సిలర్లు సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్ని ముత్యాల ముగ్గులు వేశారు. వైశ్య భవన్‌లో ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా పంచవటి నోముల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఇన్‌చార్జి చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు ఉన్నారు.

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని అనేక గ్రామాల్లో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను చాటి చెప్పే విధంగా రంగులతో అందంగా ముగ్గులు వేశారు. నదిలో సంక్రాంతి స్నానాలు ఆచరించారు. అనంతరం స్థానిక శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ దేవాలయాలను సందర్శించారు. పలువురు మహిళలు శ్రీ కృష్ణుడు-రాధా చిత్రపటాన్ని ఉంచి వ్రతాలు ఆచరించారు. పలువురు మహిళలు గౌరీ వ్రతాలు ఆచరించారు. కనుమ పండుగ రోజున మహాలక్ష్మి పూజలు, నోములు జరిపి పసుపు, కుంకుమలు స్వీకరించారు.

రాయికల్: రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మండలంలోని ఇటిక్యాల గ్రామంలో గ్రామ సేవా సమితి ఆధ్వర్యంలో, ఒడ్డెలింగాపూర్ గ్రామంలో ఒడ్డెర కాలనీ టైగర్స్ యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి బోగ శ్రావణి బహుమతులను అందించారు. కుమ్మరిపెల్లి గ్రామ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో మొదటి బహుమతి ఇద్దాం నవీన్ సూపర్ కింగ్ టీమ్, రెండో బహుమతి పంచతి రాజు రాక్ స్టార్ టీమ్‌లు గెలుచుకున్నారు. వస్తాపూర్ గ్రామంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇందులో ఎనిమిది గ్రామాల నుంచి జట్లు వచ్చాయి. మొదటి స్థానంలో వస్తాపూర్ నిలువగా, రెండో స్థానంలో శివనాయక్ తండా నిలిచింది. ఈ కార్యక్రమంలో గ్రామ సేవా సమితి అధ్యక్షుడు కంటె విష్ణు, ఎంపీటీసీ కొమ్ముల రాధఆదిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మహిపతి రెడ్డి, ఉప సర్పంచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కొడిమ్యాల : మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం ప్రజలు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని ఆలయాల్లో ఉదయం నుండె పూజలు చేసారు. మహిళలు వాకిళ్లలో ఉదయం నుండె ముగ్గులు వేసుకుంటు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.

పెగడపల్లి: మండలంలో సోమవారం మకర సంక్రాంతి అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రంలోని స్వయం భూ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సర్పంచ్ మేరుగు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులుగా అందించారు. ఆలయ కమిటీ సభ్యులు పార్థసారథి, కిషన్‌రావు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: సంక్రాంతి పండుగా జిల్లాలోని ప్రజలందరి జీవితాల్లో క్రాంతి నింపాలని కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆకాంక్షించారు. ప్రతి సంవత్సరం మకర సంక్రాంతి రోజు పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో వేడుకలు విద్యాసాగర్‌రావు ఆధ్వర్యంలో వైభవంగా పురోహితులు నిర్వహిస్తారు. స్వామి వారికి పంచామృతాభిషేకం చేసి అభరణాలతో ప్రత్యేక అలంకణను చేసి పూజలు నిర్వహించారు. అనతరం శబరిమలలో కనిపించే మకరజ్యోతి దర్శనాన్ని ఆలయంలో టీవీలో భక్తులతో కలసి వీక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రానావేణి సుజాత- సత్యనారాయణ, మహాజన్ నరసింహులు, కూన గోవర్ధన్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సంక్రాంతి, కనుమ పడుగలను ప్రజలు సోమ, మంగళవారం రోజులలో ఘనంగా జరుపుకున్నారు. సంకాంత్రి సందర్భంగా మండలంలోని ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. మండల కేంద్రంలోని ఆలయంలోని శివుడికి ఇష్టమైన విబుది ఉండాలు, రుద్రాక్షలు, దీపెంతాలు, వత్తులు, బిల్వ పత్రాలు ఇలా 108 రకాలతో ప్రత్యేక పూజలు జరిపారు. సుహాశినీలు గౌరిదేవికి నోములు సమర్పించారు. మహిళలు రంగు రంగుల ముగ్గులు వేశారు.

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో సోమవారం మకర సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు, యువ తులు ఇళ్ల ముందు రంగవల్లులు అలంకరించారు. ఘుమఘుమలాడే పిండి వంటలు తయారు చేశారు. పలు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు మహిళలు, యువతులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

వెల్గటూర్: మండలంలోని వివిధ గ్రామాలలో సంక్రాంతి సంబురాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు వేకువ జామునే లేచి, వాకిళ్లు కల్లాపి చల్లి రంగు రంగుల అందమైన ముగ్గులు వేస్తూ కనిపించారు. ముగ్గుల మధ్యలో ఆవు పేడతో చేసిన గొబ్బెలు పెట్టి, వాటి చుట్టూ నవ ధాన్యాలు పోశారు. గ్రామాలలో ఏ ఇంటి ముందు చూసినా అందమైన రంగవళ్లులే దర్శనమిచ్చాయి. కోటిలింగాలలో గోదావరి నదీ స్నానం చేసిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కొంత మంది మహిళలు వారి వారి ఆచారాల మేరకు సంక్రాంతి నోములు నోచుకున్నారు. గ్రామాలలో చిన్నారులు గాలి పటాలను ఎగురవేస్తూ ఆనందంగా గడిపారు. వివిధ రకాల పిండి వంటలు చేసుకొని కుటుంబ సభ్యుల మధ్య విందులు చేసుకున్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి, యామపూర్, ఇబ్రహీంపట్నం,గోధుర్‌తో పాటు ఆయా గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిపారు. యువకులు గాలి పటాలు ఎగరవేశారు. మహిళలు ఇంటి ముందు రంగురంగులతో ముగ్గులు వేశారు. యామపూర్ గ్రామానికి చెందిన బైని సోని అయోధ్య రామ మందిరం ముగ్గు వేసి భక్తిని చాటుకున్నారు. వేములకుర్తి గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఘనంగా కనుమ వేడుకలు

వెల్గటూర్: మండలంలోని వివిధ గ్రామాలలో కనుమ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కొందరు మహిళలు తమ కుటుంబ సౌభాగ్యం కోసం గౌరీ వ్రతాలు ఆచరించారు. కనుమ పండుగ రోజున మహాలక్ష్మి పూజలు, నోములు జరిపి పసుపు, కుంకుమలు కన్యలకు, ముత్తయిదువులకు వాయినాలు ఇచ్చారు. వివిధ రకాల పిండివంటలు చేసుకొని ఆరగించారు.



ధర్మపురిలో వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు







వెల్గటూర్, కొడిమ్యాలలో ముగ్గులు వేస్తున్న యువతులు..ధర్మపురిలో ముగ్గులు పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు

ఘనంగా సౌభాగ్య కాత్యాయనిదేవి వ్రతం

మెట్‌పల్లి, జనవరి, 16 : మెట్‌పల్లి పట్టణంలోని పెద్దమ్మ ఆలయంలో సౌభాగ్య కాత్యాయని దేవి వ్రతం మహిళలు ఘనంగా నిర్వహించారు. కనుమ పండుగా మంగళవారం సందర్భంగా పెద్దమ్మ ఆలయంలో శ్రీ కాత్యాయని దేవి వ్రతాలు, సువాసిని గాజుల పూజలు, కుంకుమ పూజలు ఆలయ పురోహితుడు మదన్‌శర్మ అంగరంగ వైభవంగా జరిపించారు. ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారికి, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకం జరిపి లోక కళ్యాణార్థం ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవ మూర్తులతో భక్తులు ఆలయం చుట్టు ప్రదక్షనలు చేసి ఆయలంలో ఏర్పాటు చేయగా సామూహిక వ్రతాలు, సువాసిని గాజులు, కుంకుమ పూజలను భక్తులచే జరిపించారు. అనంతరం శ్రీఐశ్వర్యలక్ష్మి గోశాల తరుపున గాజుల పూజ నిర్వహించి మహిళలకు పసుపు కొమ్ము, గాజులను ప్రసాదంగా అందజేశారు. అనంతరం భక్తులు గోశాలోని ఆవులకు ఆహారం అందజేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



మెట్‌పల్లి పెద్దమ్మ ఆలయంలో ఉత్సవ మూర్తులతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

భక్తి శ్రద్ధలతో రాములోరి అక్షింతలకు పూజలు

కోరుట్ల, జనవరి 16 : రాములోరి ప్రతిష్ఠాపన కోసం ఆయోధ్య నుంచి కోరుట్ల మండలం చిన్నమెట్‌పల్లికి వచ్చిన అక్షింతలకు గ్రామస్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. గ్రామానికి వచ్చిన అంక్షింతలతో గ్రామస్థులు బాజాబజేంత్రీల మధ్య మంగళహారతులతో స్వాగతం పలికారు. గ్రామంలోని అంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి ఇంటింటికి అంక్షంతలను పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందు పరిషత్, బీజేపీ, బీజేవైఎం, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటారు తీగల చోరీ

ఎల్లారెడ్డిపేట, జనవరి 16: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మూడు వార్డుల్లో తాగు నీటి ట్యాంకుల వద్ద ఉన్న విద్యుత్ మోటార్లతోపాటు రైతులకు చెందిన వ్యవసాయ మోటార్ల విద్యుత్ తీగలు మంగళవారం చోరీకి గురయ్యాయి. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి దేవరాజు పరిశీలించారు. జీపీకి చెందిన విద్యుత్ తీగ దొంగతనంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని కార్యదర్శి దేవరాజు పేర్కొన్నారు. తాగు నీటికి ప్రజలు ఇబ్బందులు పడకుండా విద్యుత్ తీగలను బిగించామన్నారు. పోలీసులు రాత్రి వేళలో గస్తీ పెంచాలని, చోరీలను అరికట్టాలని కోరుతున్నారు.

సీఎంను కలిసిన జగిత్యాల వాసి

జగిత్యాల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమ్మిట్ (ప్రపంచ ఆర్థిక వేదిక శిఖరాగ్ర సమావేశం)లో పాల్గొనడానికై సీఎం రేవంత్ రెడ్డి సోమవారం జరిపిన పర్యటనలో జగిత్యాలకు చెందిన వలస వ్యవహారాల విశ్లేషకులు, టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి ఉన్నారు. స్విట్జర్లాండ్‌లోని జురిక్ విమానాశ్రయానికి సీఎం రేవంత్ రెడ్డి బృందంతో పాటు భీంరెడ్డి చేరిన సందర్భంగా అక్కడి తెలుగు ప్రవాసులు ఘన స్వాగతం పలికారు. జెనీవాలో ఈనెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరిగే గ్లోబల్ ఫోరం ఆన్ మైగ్రేషన్ అండ్ డెవలప్‌మెంట్ సదస్సులో పాల్గొంటున్నానని భీంరెడ్డి తెలిపారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

ధర్మపురి, జనవరి 16: ధర్మపురి మండలంలోని పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో వావిలాల ఉమా జ్ఞాపకార్థం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వరుస విజేతలుగా తోడేటి మంజుల (ప్రథమ), బోదనపు వినీత (ద్వితీయ), తూము ల సౌమ్య (తృతీయ) నిలిచారు. విజేతలకు ప్రభు త్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కు మార్ సతీమణి కాంతాకుమారి చేతుల మీదుగా బహుమతులు అందించారు.

●నేరెళ్ల గ్రామంలో నేరెళ్ల, గోవింద్‌పల్లె బీజేపీ గ్రామ శాఖల ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో వరుస విజేతలుగా మల్యాల పూజిత (ప్రథమ), దాసండ్ల అఖిల (ద్వితీయ), పాదం కృష్ణవేణి (తృతీయ) నిలిచారు. విజేతలకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురా లు బోగ శ్రావణి చేతుల మీదుగా బహుమతులు అందించారు. సర్పంచ్ పలిగిరి వసుంధర, బీజేపీ మండల అధ్యక్షులు గంగారాం, దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, మండల ఉపాధ్యక్షులు కోల రామన్న, మదు, సంతోష్ పాల్గొన్నారు.

రాజారం గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలపై వేసిన ముగ్గు ఆక ట్టుకుంది. రాజారం గ్రామానికి చెందిన ఏదులపురం కూతురు మనోజ్ఞ ఆరు గ్యారెంటీలపై రకరకాల రంగులతో ముగ్గు వేసింది. సీఎం, ప్రభుత్వ విప్ పేర్లు చేర్చి పార్టీపై అభిమానాన్ని చాటుకుంది.

వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

కోరుట్ల, జనవరి 16 : పట్టణంలోని వేంకటేశ్వర ఆలయంలో దనుర్మాస ఉత్సవాలలో భాగంగా సంక్రాంతి పర్వదినం పురస్కరించుకోని స్వామి వారికి ఉంజల్ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చన అభిషేక కార్యక్రమాలను జరిపారు. ఉంజల్ సేవ కార్యక్రమాలను నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వేదపండితుడు బీర్నంది నర్సింహచారీ, పాల్గొన్నారు.

పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో సోమ, మంగళవారలలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. బోగి, బొమ్మల కొలువు, కనుము కార్యక్రమాలను మహిళలు ఘనంగా నిర్వహించారుకున్నారు. ఇంటి ముంగిట్లో రంగవళ్ళులను వేసి నవదాన్యాలతో గోబ్బెమ్మలను ఏర్పాటు చేసారు. గ్రామాలలోని రైతులు ఎడ్లకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అయా కార్యక్రమాలలో గ్రామస్తులు పాల్గొన్నారు.

●మకర సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని కోరుట్ల అయ్యప్ప దేవాలయం విశేష పూజలను నిర్వహించారు. శబరిమల క్షేత్రంలో జ్యోతి దర్శనం పురస్కరించుకొని అయ్యప్ప జ్ఞాన సరస్వతి దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. వేదపండితులు పాలెపు రాంశర్మ మత్రోచ్చారణ మద్య మహాపడి పూజ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప మాల దారులు ఇరుముడి దరించి నెయ్యాబిషేకం జరపి స్వామి వారికి ప్రత్యేక పూజలను జరిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అయ్యప్ప, గణపతి, సుబ్రమణ్య ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అయ్యప్ప, గణపతి, సుబ్రమణ్య స్వాముల ఉత్సవ విగ్రహాలతో పాటు మూల విరాట్‌కు అభిషేకాలను నిర్వహించారు. అనంతరం మహా పడి పూజ నిర్వహించి కర్పూర హారతులను అందించారు. అయ్యప్ప మాలదారులు, భక్తులు ఆద్యాత్మిక చింతన నిర్వహించి మకర జ్యోతి దర్శనం సందర్భంగా భక్తులకు సౌకర్యార్థం టీవీలను ఏర్పాటు చేసి జ్యోతి దర్శనం చేయించారు. భక్తులకు ఆలయ నిర్వహకులు అన్న దాన కార్యక్రమం నిర్వహించారు.



ఉంజల్ సేవ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన స్వామి వారు

సంక్షిప్త సమాచారం

మల్లాపూర్ : మండలంలోని రాఘవపేట గ్రామానికి చెందిన చక్రవర్తుల సంతోష్, ముత్యంపేట గ్రామానికి చెందిన శ్రీనివాస్‌ల మొబైల్ ఫోన్లు ఇటువల పోగొట్టుకున్నట్లు సీఈఐఆర్ పోర్టల్ దరఖాస్తు చేసుకున్నారు. పోగొట్టుకున్న వారి మొబైల్ ఫోన్లును మంగళవారం పట్టుకొని ఇచ్చినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు వారి మొబైల్ ఫోన్లు ఇటివల పోగొట్టుకున్నట్లు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో వాళ్లకు సంబంధించిన ఫోన్లును ట్రేక్ చేసి పట్టుకోని తిరిగి వారికి అప్పగించినట్లు ఆయన తెలిపారు.

మెట్‌పల్లి : బీఎస్పీ అదినేత మాయావతి జన్మదిన వేడుకలు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల లింబాద్రి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం పార్టీ అభివృద్ధికి నాయకులు పట్టణంలో విరాళాలను సేకరించారు. నాయకులు లక్ష్మణ్, గోరు మంతుల సురేందర్, ప్రభాకర్, బొనగిరి అమర్, శ్రీకేష్, పాల్గొన్నారు.

కోరుట్ల : కోరుట్ల పట్టణంలో మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆందోళనను పోలీసులు భగ్నం చేశారు. జిల్లా కేంద్రంతో పాటు పట్టణ శివారులోని ప్రభుత్వ భూమిని నిరుపేదలకు కేటాయించాలని డిమాండ్ చేస్తే కొన్ని రోజులుగా సిపిఎం నేతలు చేస్తున్న ఆందోళనతో ఆ పార్టీ నాయకులను జిల్లా కేంద్రంలో ఆరెస్టుకు నిరసిస్తూ పట్టణంలో ఆందోళన చేస్తున్న ముందుస్తూ సమాచారంతో పోలీసులు ముందస్తు అరెస్టులను చేపట్టారు. అరెస్టు చేసిన నాయకులను జిల్లా కేంద్రంలోని ఓ పోలీసు స్టేషన్‌కు బందోబస్తు మధ్యలో తరలించారు. కాగా కొత్త బస్టాండ్ ప్రాంతంలో పోలీసులు బారీ బందోబస్తును నిర్వహించారు.

కథలాపూర్ : మండల కేంద్రంలో నిర్వహించిన కేపీఎల్ క్రికెట్ టోర్నీలో కథలాపూర్ జట్టు విజేతగా నిలిచింది. ఈ టోర్నీలో 8 జట్లు పోటాపోటీగా తలపడ్డాయి. గత ఎనిమిది సంవత్సరాలుగా మండల కేంద్రంలో కేపీఎల్ పోటీలు నిర్వహిస్తున్నామని నిర్వాహకుడు శ్రీకాంత్ తెలిపారు. విజేత జట్టుకు బహుమతి పంపిణీ చేశారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ గ్రామానికి చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయుడు మద్దెన్నపల్లి శ్రీకాంత్ ప్రాంకీయాటిస్ అనే వ్యాధి సోకింది. శ్రీకాంత్ గత నాలుగు సంవత్సరాలుగా ప్రాంకీయాటిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. కాగ మంగళవారం పూర్వ విద్యార్థులు గురుపు పరిస్థితి గమణించి ఇంటికి వెళ్లి 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. విద్యార్థులు, పాల్గొన్నారు.

వెల్గటూర్: మండలంలోని జగదేవ్‌పేట గ్రామంలో సోమవారం జన కల్యాణ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. బీఎస్పీ అధినేత్రి మాయావతి పుట్టిన రోజు జన కల్యాణ్ దివస్‌ను బీఎస్పీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ని ర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు బచ్చల స్వామి, గ్రామ శాఖ అధ్యక్షుడు బచ్చల శైలేందర్, బచ్చల సుమన్, రామడుగు వెంకటేష్, స్వామి, దిలీప్, అనిల్, రమేష్ ప్రశాంత్, వినయ్ పాల్గొన్నారు.

గంభీరావుపేట : గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో చంద్రాగౌడ్ అనే వ్యక్తి మృతి చెందాడు. దీంతో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి మంగళవారం చంద్రాగౌడ్ కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేశారు. సమాజ సేవలో భాగస్వాములుకావాలన్నారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు కాస శ్రీనివాస్, బీసీ సెల్ అధ్యక్షుడు పండగ నరేష్, ఉపాధ్యక్షుడు అంబటి నాగార్జున, ప్రధాన కార్యదర్శి అంబటి సురేష్, జిల్లా మైనార్టీ సెల్ నాయకులు షేక్ తాజొద్దీన్, కొత్తపల్లి చంద్రం, గంగి స్వామి, జోగు సురేష్, సుద్దాల దేవయ్య, హరీష్, అక్కల స్వామి, మధు తదితరులు ఉన్నారు.

ముస్తాబాద్ : ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన సారుగు విజయ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా పోచమ్మ యూత్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని మంగళవారం అందజేశారు. కుటుంబానికి అండగా నిలబడుతామని సభ్యులు పేర్కొన్నారు.